క్లుప్తంగా

చిన్న సంఘాలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మందస: గ్రామస్థాయిలో చిన్న స్వయంశక్తి సంఘాలను బలోపేతం చేయాలని వైఎస్సార్ క్రాంతిపథం హెచ్‌ఆర్ ఏపీఎం సుబ్బయ్య నాయుడు, సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మందస పట్టణంలో మహిళా సంఘాలు, వీవోఏ, సీసీలతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీవోఏలు తమ పరిధిలో ఉన్న చిన్న సంఘాలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. మార్చిలోపు ఐబీ స్ట్రాటజీ గ్రామసంఘం స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి రికవరీ శతశాతం చేయాలన్నారు. ఐబీ, లైవ్‌లీ హుడ్, సామాజిక అంశాలను చర్చించుకోవాలని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ సాయిరాం, మండల మహిళా సమాఖ్య కోశాధికారి బాలక విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దేవుపురంలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న దేవుపురం గ్రామస్తులు

మందస: మండలంలోని నర్సింగపురం పంచాయతీ దేవుపురంలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తూ కళ్లాల్లో ఉన్న గడ్డి కుప్పలకు నిప్పు అంటుకొని, గేదెల పున్నయ్య, పుష్పలకు చెందిన గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్తులు మంటలను అదుపు చేశారు. గ్రామానికి ప్రమాదస్థలం దగ్గరగా ఉండడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు.

కార్మిక శాఖ ధ్రువీకరణ తప్పనిసరి



విజయకుమార్

కాశీబుగ్గ: వైఎస్సార్ బీమా నమోదు సమయంలో ఎవరైనా వారి వృత్తిని భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికులుగా నమోదు చేసుకొని ఉంటే అలాంటి వారు భవన నిర్మాణ కార్మికులుగా కార్మిక శాఖ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పొందాలని పలాస అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కార్మిక సభ్యత్వం పొందని కార్మికులకు బీమా వర్తించదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94925 55040 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆరుతడి పంటలపై ఆసక్తి



బెండి వద్ద సాగు చేస్తున్న రాగులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి, సీతాపురం, కొండవూరు, గల్లి, నగరంపల్లి, వజ్రపుకొత్తూరు, కిడిసింగి, రాజాం, రిట్టపాడు తదితర గ్రామాల రైతులు అరుతడి పంటల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే రాగులు, పొద్దు తిరుగుడు, నువ్వుతో పాటు పలు రకాల పంటలు విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతానికి వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంటలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి.

సింహద్వారం ప్రతిష్ట



ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

సోంపేట: మండలంలోని ఎర్రముక్కాం గ్రామంలో సింహద్వారం ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం గ్రామస్తులు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు, వివిధ సంఘాల నాయకులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలు

సంతబొమ్మాళి: ఓపెన్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు 2022–23 విద్యా సంవత్సరానికిగానూ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మార్పు నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అనంతరం చదువును ఆపేసిన వారు, ఇంటర్ పూర్తిచేయని అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తును కళాశాలలో అందజేయాలని సూచించారు.

పాడి సిరులు



వెంకటరమణకు సూచనలిస్తున్న పశువైద్యాధికారి శిరీష

- డెయిరీ పరిశ్రమలో రాణిస్తున్న మాజీ సైనికుడు
- తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడి
- తోడుగా నిలుస్తున్న పశుసంవర్ధక శాఖ

కంచిలి: ఇటీవల కాలంలో అటు రైతులను ఇటు నిరుద్యోగ యువతను అమితంగా ఆకర్షిస్తున్న వ్యవసాయ అనుబంధ రంగం పాడి పరిశ్రమ. ఎందరో యువ రైతులు డెయిరీ ఫారం ప్రారంభించి ఆర్థిక ప్రగతి దిశగా సాగుతున్నారు. ఓర్పు, సహనం, ఎదగాలనే పట్టుదల ఉండాలే కానీ ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని నిరూపిస్తున్నారు. ఇలాగే కేవలం రెండు జెర్సీ ఆవులతో మొదలై ప్రస్తుతం ప్రతిరోజూ లాభాలు అర్జిస్తున్నాడు. కంచిలి మండలం మఠం సరియాపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు నల్లాన వెంకటరమణ.

ఉద్యోగ విరమణ అనంతరం

2017 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పాడిరంగంపై ఉన్న మక్కువతో వెంకటరమణ డెయిరీ ఫారం ఏర్పాటు చేయాలనుకున్నాడు. తనకు కుంబరినౌగాం పంచాయతీ పరిధి బురుపడ గ్రామం వద్ద మూడెకరాల స్థలంలో ఉండడంతో అక్కడే సరైన స్థలమని నిర్ణయించుకొన్నాడు. అనంతరం పాడి పరిశ్రమపై అనుభవం లేకపోవడంతో మండల పశువైద్యాధికారి టి.శిరీషను సంప్రదించాడు. ఆమె డెయిరీ ఫారం మౌలిక విషయాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా డెయిరీ రంగంలో ఇదివరకు అనుభవం ఉన్న కొంతమంది పాడి రైతులను కలిసి ఈ రంగంలో వచ్చే లాభనష్టాలు గురించి తెలుసుకొన్నాడు. అనంతరం డెయిరీని ప్రారంభించారు.

రెండు ఆవులతో ప్రారంభమై...

ఒకేసారి అధిక సంఖ్యలో పశువులు తెచ్చి భారీస్థాయిలో పెద్ద డెయిరీని ఏర్పాటు చేయడం రిస్క్ అని వెంకటరమణ భావించాడు. చిన్నస్థాయి నుంచి ఆరంభించి పాడిరంగంపై అనుభవం వచ్చాక పశువుల సంఖ్యను పెంచుకోవాలని ఆలోచన చేశాడు. తదనుగుణంగా రెండు జెర్సీ ఆవులతో తాటాకు కొమ్మల షెడ్డులో ఫారం ప్రారంభించారు. క్రమంగా పశువుల సంఖ్యను పెంచుకోవడానికి తన ఫారంలో పుట్టినటువంటి ఆడ దూడలకు మంచి పోషణ అందించి, సకాలంలో చూడి కట్టించి మంచి పాడి ఆవులుగా తీర్చిదిద్దారు. అలా రెండు ఆవులతో ప్రారంభమైన డెయిరీ ఫారంను 15 పశువుల గల ఫారంగా తీర్చిదిద్దుకున్నారు. అలాగే తనకున్న స్థలంలోనే పశుగ్రాసాలను సాగుచేస్తున్నాడు. డైరీ ఫారం వద్దనే పశుగ్రాసం సాగు చేయడం వలన పశుగ్రాస రవాణా సులభంగా ఉంటోంది. కూలీలకు అయ్యే ఖర్చు బాగా తగ్గుతుంది.

ఖర్చు తగ్గించుకోవాలి



చిన్నస్థాయి నుంచి పాడి పరిశ్రమను ప్రారంభించి, మెల్లగా పశువుల సంఖ్యను పెంచుకుంటూ పెట్టుబడి ఖర్చును తగ్గించుకుంటేనే ఈ రంగంలో లాభాలు సాధ్యమవుతాయి. బహువార్షిక పశుగ్రాసాలతో పాటు ఏక వార్షిక పశుగ్రాసాలను కూడా సాగు చేసుకోవాలి. టీఎంఆర్ వాడకంతో పాల దిగుబడి పెంచుకోవచ్చు.

– నల్లాన వెంకటరమణ, డెయిరీ ఫారం నిర్వాహకుడు

సలహాలతో ముందడుగు



వెంకటరమణ డైరీ ఫారం ప్రారంభించడానికి సలహాలు, సూచనలు పాటించి ఒక్కో అడుగు ముందుకు వేశారు. డైరీ ఫారం ప్రారంభించినప్పటి నుంచి సలహాలు అందిస్తూ విజయపథంలో నడిచేందుకు శాఖాపరంగా సాయపడుతున్నాం. ఈయన డైరీ రంగంలో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని, ఈ రంగంలో మరికొంతమంది ఉపాధి పొందాలి.

– టి.శిరీష, మండల పశువైద్యాధికారి, కంచిలి

'అమరవీరుల బాటలో నడవాలి'



మాట్లాడుతున్న మాధవరావు

పలాస: శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరుల బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి.మాధవరావు పిలుపునిచ్చారు. మండలంలోని నీలావతి గ్రామంలో పోతనపల్లి జయమ్మ మూడో వర్ధంతి సభను శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు మల్లేశ్వరరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రైతుకూలీ సంఘం నాయకుడు గొరకల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో మాధవరావు మాట్లాడుతూ నాటి నక్సల్బరీ, శ్రీకాకుళం సాయుధ పోరాటంలో జయమ్మ పాల్గొని అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. నేటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన ప్రజలు మరింత దోపిడీని ఎదుర్కొంటున్నారని, దోపిడీ పీడన లేని వ్యవస్థ కోసం పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో అరుణోదయ నాయకుడు రామారావు, ప్రజా గాయకుడు కుత్తుం వినోద్, వెలగాడ కృష్ణారావు, బైరి కూర్మారావు, మామిడి భీమారావు, జుత్తు వీరాస్వామి, పోతనపల్లి కుసుమ, కంసు కృష్ణమూర్తి, సవర బంగ్లాకుమార్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు వార్తలపై నిరసన



ఈనాడు పేపర్లను తగలబెడుతున్న నాయకులు

కాశీబుగ్గ: ఈనాడు దినపత్రికలో తప్పుడు వార్తల ప్రచురణపై పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి మూడు రోడ్లు కూడలి వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. పాత ఫొటోలను ప్రచురించి ప్రజలను తప్పుదొవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

అనంతరం ఈనాడు పత్రిక ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్, పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్, ప్రభుత్వ విప్ శంకర్ పండా, కౌన్సిలర్లు, నాయకులు పోతనపల్లి హరి, రోణంకి శ్రీనివాస్, బదకల పులిరాజు, మార్పు యుగంధర్, బళ్లా శ్రీను, అంబటి ఆనందరావు, తూముల శ్రీను, గీతారవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా డోలోత్సవాలు



కళాకారుల నృత్య ప్రదర్శన



హిరణ్య కశిపుని సంహార ఘట్టం నృత్య రూపకం దృశ్యం

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగలో వెలసిన చక్రధర పెరుమాళ్లస్వామి డోలోత్సవాలు శుక్రవారం వైభవంగా సాగాయి. వేడుకల్లో భాగంగా వేకువజామున శ్రీదేవీ, భూదేవీ సమేత చక్రధరస్వామికి సుప్రభాత సేవ, నిత్య దర్శనాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా సాయిరాం భాగవతార్ ఆలపించిన హరికథా గానం ఆద్యంతం ఆకట్టుకుంది. బెజ్జిపుట్టుగ పొందల బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జానపద నృత్య ప్రదర్శన అలరించింది.

ఆకట్టుకున్న రంగవల్లులు



ఇచ్ఛాపురం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు సైన్స్ రంగవల్లుల పోటీలు శుక్రవారం నిర్వహించారు. మొత్తం 132 మంది విద్యార్థులు వివిధ రకాల ముగ్గులు వేశారు. రంగవల్లులను ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రజనీకుమారి పరిశీలించారు. ఇటువంటి రంగవల్లికల వలన విద్యార్థుల్లో సృజనాత్మకత, చిత్రలేఖన అభ్యాసనం మెరుగవుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ రంగవల్లులు వేస్తున్న విద్యార్థులు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



శ్రీనుకి సెల్‌ఫోన్ అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాళాసు శ్రీను అనే వ్యాపారి తన రూ.50 వేల విలువైన సెల్‌ఫోన్‌ను కేటీరోడ్డులో పోగొట్టుకున్నారు. ఆ పోగొట్టుకున్న సెల్‌ఫోన్ శివ మహారణ, కొత్తపల్లి రమేష్‌లకు దొరికింది. దీంతో వారు ఆ ఫోన్‌ను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సత్యసాయి భక్తులు, పలువురు వ్యాపారులు వారి నిజాయితీని అభినందించారు.


ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష నేడు

కవిటి: మండలంలోని బల్లిపుట్టుగలో వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ నివాసంలో ఆయన అధ్యక్షత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించనున్నారు. వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌తో కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, మున్సిపాలిటీలోని ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు, ముఖ్య నేతలతో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు సాయిరాజ్ కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన వెలువడింది.

సర్వసభ్య సమావేశం నేడు

కవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు గడిచిన మూడు నెలల కాలంలో, తమ శాఖల పరిధిలో నిర్వహించిన ప్రగతి నివేదికలతో కూడిన పూర్తి సమాచారంతో, రెండు కాపీలతో విధిగా హాజరవ్వాలని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఆపస్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: మార్చి 5, 6 తేదీల్లో నెల్లూరులో ఆపస్ రాష్ట్ర మహాసభలు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరగనున్నాయని చిన్నబాడం జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ మేరకు మహాసభల గోడ పత్రికలను పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. విద్యా రంగంలో సమస్యలు, సమకాలీన అంశాలపై సభలో చర్చించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నర్సింగరావు తెలిపారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి మహాసభల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

షిర్డీసాయి మందిర వార్షికోత్సవం నేడు

కాశీబుగ్గ: స్థానిక శివాజీనగర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరం ఏడో వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్, ఫౌండర్ దువ్వాడ శ్రీధర్ బాబా శుక్రవారం తెలియజేశారు. దీనిలో భాగంగా ఉదయం 5.15 గంటలకు కాగడా హారతి, 6 గంటల నుంచి నిత్యాభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

సాయంత్రం సంధ్యా హారతి అనంతరం భజన ఉంటుందని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఆర్‌హెచ్‌పురం సచివాలయం పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరం అందాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో విజయం సాధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, సర్పంచ్‌లు ఎన్ని మన్మథరావు, జోగి రాములమ్మ, ఉప్పాడ సునీత, మండల సచివాలయ కన్వీనర్ ఎం.భాస్కరరెడ్డి, ఏపీసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, నాయకులు కె.సతీష్, ఎన్.భీమారావు, పి.రామకృష్ణ, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయాన్ని గుర్తు చేయండి

నందిగాం: గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు గ్రామాల్లోని ప్రజలకు సంక్షేమ పథకాలు ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని గుర్తు చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని నౌగాం సచివాలయం పరిధిలోని పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ కార్యకర్తలతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జగనన్న సచివాలయ కన్వీనర్ల మండల చైర్మన్ జద్యాడ జయరాం, స్థానిక సర్పంచ్ పుష్యా సత్యం, నాయకులు కింతల ధర్మారావు, కణితి నారాయణమూర్తి, సైలాడ లావన్న, దీర్ఘాసి కృష్ణారావు, బాలక మధు, బార్నన బాలకృష్ణారావు, పైల కరుణాకర్, రట్టి నాగరాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రణాళికలు నిర్దేశించుకోవాలి'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు

టెక్కలి: విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే విద్యార్థులు పక్కాగా ప్రణాళికలు నిర్దేశించుకోవాలని విశాఖపట్నం న్యూఎడ్జి సంస్థకు చెందిన నిపుణులు శ్రీకాంత్, కిరణ్‌లు పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్నత విద్య అనే అంశంపై ఆదిత్య కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూఎస్ఏ, కెనడా వంటి దేశాల్లో ఉన్నత విద్య కోసం ప్రభుత్వాలు ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఆర్థిక స్తోమత లేనివారికి సైతం బ్యాంకులు రుణాలు అందజేస్తున్నాయని వెల్లడించారు. ఇటువంటి అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకుని విదేశాల్లో ఉన్నత విద్య కోసం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కెరీర్ గైడెన్స్ సెల్ విభాగాధిపతులు ఎస్.భాస్కర్‌బాబు, డి.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు



బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

కోటబొమ్మాళి: మండలంలోని పాకివలస–దంత ఆర్‌అండ్‌బీ రోడ్డులో దంత జంక్షన్ నుంచి సారవకోట మండలం అలుదు గ్రామం వరకు రూ.15 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు, బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు రోడ్లు, భవనాల శాఖ ఈఈ పి.సత్యనారాయణ తెలియజేశారు. ఈ మేరకు దంత జంక్షన్‌లో గరీబుల గెడ్డపై రూ.1.98 కోట్ల నిధులతో కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. రానున్న వర్షాకాలంలోగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ శరవేగంగా నిర్మాణ పనులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ ఈ.రవికాంత్, జేఈ జి.సరోజ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ట్యాబ్‌లను వినియోగించుకోవాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ధనంజయ మజ్జి

కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో అందించిన ట్యాబ్‌లను వినియోగించుకోవాలని ఎంఈవో ధనంజయ మజ్జి సూచించారు. మండలంలోని బొరివంక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సనపల రామకృష్ణతో కలిసి ట్యాబ్‌ల వినియోగం, పనితీరును శుక్రవారం పరిశీలించారు. మరిన్ని మెరుగైన విధానాలతో లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

ఎస్‌జీఎఫ్ సేవలు ప్రశంసనీయం



ఫుడ్‌బ్యాంక్ కౌంటర్ ప్రారంభిస్తున్న ఎస్జీఎఫ్ సభ్యులు

కవిటి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువతీ, యువకులు ఎస్జీఎఫ్ సంస్థగా ఏర్పడి పేద వర్గాలకు అందిస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు అన్నారు. కవిటి చింతామణి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం బస్టాండ్ ఆవరణలో ఎస్జీఎఫ్ సంస్థ ఫుడ్‌బ్యాంక్ కౌంటర్‌ను కవిటిలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కౌంటర్‌లో ఎవరి ఇంట్లోనైనా వేడుకల సమయంలో ఆహార పదార్థాలు మిగిలితే ఇందులో పెట్టేలా ఏర్పాటు చేశారు. ఇక్కడ అందుబాటులో ఉన్న ఆహారాన్ని పేదలు, ఆకలితో ఉన్నవారికి అందించేందుకు సంస్థ సభ్యులు చర్యలు తీసుకుంటారు. ఎస్జీఎఫ్ సేవలపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సమయపాలన తప్పనిసరి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలనతో ప్రజలకు సేవలందించాలని ఎంపీడీవో కె.రామారావు సూచించారు. మండలంలోని బిర్లంగి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. మహిళా పోలీసులు నిరంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పూర్ణాటకం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: సవర గోవిందపురం పాఠశాలలో పనిచేసి పదోన్నతిపై బదిలీ వెళ్లిన ఉపాధ్యాయుడు కేవీవీఎస్ ప్రసాద్, అతని భార్య సంధ్యను పాఠశాలలో హెచ్ఎం టి.రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ ఎస్.రమేష్, గ్రామపెద్దలు మూసయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.